క్లుప్తంగా

పీజీఆర్ఎస్, డయల్ యువర్ కమిషనర్ రద్దు

నెహ్రూనగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం నగర పాలక సంస్థలో ప్రతి సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీ ఆర్ఎస్, డయల్ యువర్ కమిషనర్) కార్యక్రమాలను రద్దు చేసినట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు పీజీఆర్ఎస్, డయల్ యువర్ కమిషనర్ రద్దు అంశాన్ని గమనించి సహకరించాలని కోరారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగర పాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 ఫిర్యాదు చేయవచ్చు అని చెప్పారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: సమాజంలో ఒంటరిగా జీవించే వయో వృద్ధులు, దివ్యాంగులను ఆదరించాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల రెండో ఆదివారంలో భాగంగా వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 11 రకాల నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యుల ఆదరణ కరువై, వృద్ధాప్యంతో జీవనం పోరాటం చేస్తున్నారని అన్నారు. అటువంటి వారికి సహాయ, సహకారాలు అందించాలని ఆయన దాతలను కోరారు. దాతల సహకారాలతో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన 18వ డివిజన్ అధ్యక్షుడు శానం రమేష్, సమితి కార్యదర్శి మాదాల ప్రకాష్, కోశాధికారి ఎస్వీ.రమణ, బియ్యం కమిటీ చైర్మన్ పోలేపల్లి వెంకటసుబ్రమణ్యం, కమిటీ సభ్యులు మామిడి వెంకటశ్రావణ్, పోలేపల్లి లహరి పాల్గొన్నారు.

అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



గుంటూరు మెడికల్: కొద్దిపాటి జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, పేదలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అహల్య ట్రస్ట్ నిర్వాహకులు, అహల్య ఐవీఎఫ్ హాస్పిటల్‌కు చెందిన ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. ఆదివారం తాడికొండ నియోజకవర్గ పరిధిలోని తురకపాలెం గ్రామం మంగళగిరిపాడు రోడ్డు మదీనా మసీద్ వద్ద అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో పలువురు వైద్యులు రోగులను పరీక్షించి వైద్య సలహాలు అందజేసి మందులు కూడా ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, డాక్టర్ గౌతమ్, డాక్టర్ శిరీషా, డాక్టర్ సిరి పాల్గొన్నారు.

నగరంలో ఈదురు గాలులు

నెహ్రూ నగర్: గుంటూరు నగరంలో ఆదివారం సాయంత్రం నుంచి ఈదురు గాలులు వీచాయి. కొన్ని ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

నెహ్రూ నగర్: నాజ్ సెంటర్ రిజర్వాయర్ పరిధిలో సోమవారం తాగునీటి సరఫరాలో పాక్షిక అంతరాయం కలుగుతుందని ఇంజినీరింగ్ అధికారులు ఆదివారం తెలిపారు. ఆదివార సాయంత్రం బలమైన ఈదురు గాలుల వలన చెట్లు పడిపోయి సంఘం జాగర్లమూడిలో విద్యుత్ వైర్లు తెగి నీటి సరఫరాకు అంతరాయం(పంపింగ్) కలిగిందన్నారు. నాజ్ సెంటర్ రిజర్వాయర్ పరిధిలోని పొత్తూరి వారి తోట , రాజా గారి తోట , గుంటూరు వారి తోట, కొత్తపేట ఏరియా, ఎస్సీ కాలనీ, రామిరెడ్డి తోట, పాల ఆసుపత్రి ఏరియా, లాలపేట ఏరియా, నల్లచెరువు ఏరియా పార్ట్, పట్నం బజార్, చౌత్రా సెంటర్ , గణేష్ రావు పేట, ప్రకాష్ నగర్ పై తెలిపిన ప్రాంతాల్లో సోమవారం ఉదయం పాక్షిక మంచి నీటి సరఫరా జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

శ్మశానాన్నీ వదలని కూటమి నేతలు

- గుజ్జన గుండ్ల శ్మశాన వాటికలో షాపుల నిర్మాణం
- పట్టించుకొని పట్టణ ప్రణాళిక అధికారులు
- దీనిపై ఫిర్యాదు రావడంతో నిర్మాణ పనులను ఆపివేసిన కమిషనర్
- తిరిగి పనులు ప్రారంభించేందుకు ప్రయత్నాలు



గుజ్జనగుండ్ల మెయిన్‌రోడ్డులో హిందూ శ్మశాన వాటికలో చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్

నెహ్రూనగర్: కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని తెగబడుతున్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడంతో పాటు శ్మశాన వాటికలను వదలడం లేదు. గుజ్జనగుండ్ల మెయిన్ రోడ్డులోని హిందూ శ్మశాన వాటికలో రోడ్డు వెంబడి ఉన్న ఖాళీ స్థలంపై స్థానికంగా కూటమి నేతల కన్ను పడింది. గత ప్రభుత్వంలో అక్కడ షాపులు వేయాలని చూసినా ఫలితం లేక పోవడంతో.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూటమిలోని ఓ వర్గానికి చెందిన వారు అక్కడ హవా కొనసాగిస్తూ రెండు ఫోర్లు షాపులు నిర్మాణం చేపట్టారు. ఇంత జరుగుతున్న పట్టణ ప్రణాళిక అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై నగర కమిషనర్‌కు పలు ఫిర్యాదులు రావడంతో గత కొద్ది రోజుల క్రితం కమిషనర్ పులి శ్రీనివాసులు సదరు షాపులను పరిశీలించి నిర్మాణ పనులు ఆపివేయాలన్నారు.

15 సెంట్లలో షాపింగ్ కాంప్లెక్స్

గుజ్జనగుండ్ల హిందూ శ్మశాన వాటిక 1.40 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. రెండు సార్లు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సదరు స్థలం రోడ్డు విస్తరణలో పోవడంతో ప్రస్తుతం 1.10 ఎకరం మాత్రమే ఉంది. సుమారు 15 సెంట్లలో షాపులను నిర్మించేందుకు కూటమి ప్రభుత్వంలోని ఓ వర్గానికి చెందిన కూటమి నేతలు కుట్రలు పన్నారు.

ప్రస్తుతం గుజ్జనగుండ్ల మెయిన్ రోడ్డులో గజాం 1.30 నుంచి 1.50 లక్షల దాకా మార్కెట్ విలువ ఉంది. కింద 12, పైన 13 షాపులు ఒక షాపులకు రూ.3.50లక్షలు దాకా వసూలు చేసి నిర్మాణం చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే అండదండలతో నేతలు రెచ్చిపోయి అక్కడ షాపులు నిర్మాణం చేపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని మాకు కూడా షాపులు కేటాయించాలని గత కొద్ది రోజుల క్రితం స్థానికులు ఎమ్మెల్యేను కలసి ఫిర్యాదు చేశారు.

కౌన్సిల్ పాస్ చేయించేందుకు కుట్రలు

ప్రస్తుతం నిర్మాణ పనులను కమిషనర్ పులి శ్రీనివాసులు ఆపివేయించారు. సదరు షాపుల నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలని ప్రభుత్వ పెద్దల నుంచి కమిషనర్‌పై తీవ్ర ఒత్తిళ్లు వస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే సదరు షాపులను ప్రస్తుతం ఎవరైతే నిర్మించుకుంటున్నారో వారికే దక్కే విధంగా కౌన్సిల్‌లో పాస్ చేయించుకునేందుకు కూటమి నేతలు కుట్రలు పన్నినట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగానే తిరిగి పనులు పూర్తి చేసేందుక స్థానిక కూటమి నేతలు పావులు కదుపుతున్నారు. దీనిపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఒక వర్గం వారే షాపులను దక్కించుకోవాలని చూడటం ఎంత వరకు కరెక్ట్ అని దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఓపెన్ ఆక్షన్ పెట్టాలి



గుజ్జన గుండ్ల శ్మశాన వాటికలో షాపులను కూటమి నేతలు తమ అనుకునే వారికే కేటాయించుకుంటున్నారు. దీనిపై ఎమ్మెల్యేను కలసి వినతి పత్రం ఇచ్చాం. షాపులను కేవలం ఒక వర్గానికే కాకుండా అన్ని వర్గాలకు వర్తింపజేసే విధంగా ఓపెన్ ఆక్షన్ పెడితే చాలా మందికి ఉపయోగపడుతుంది.

– బ్రహ్మం, గుజ్జనగుండ్ల

కార్పొరేషన్ వేలం వేయాలి



గుజ్జనగుండ్ల శ్మశాన వాటికలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను నగరపాలక సంస్థ ఆధీనంలోకి తీసుకుని నిజమైన పేదలకు కేటాయిస్తే వారికి మేలు చేసిన వారవుతారు. కాని ఇక్కడ అలా కాకుండా కేవలం కొంత మంది మాత్రమే షాపులను దక్కించుకోవాలని చూస్తున్నారు.

– గుర్రాల పాములయ్య, స్థానికుడు

పిన్ పాయింట్ ప్రకారం పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో మెరుగైన పారిశుద్ధ్యం కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు నిర్దేశిత సమయంలో విధులకు హాజరై పారిశుద్ధ్య పనులను పిన్ పాయింట్‌గా పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. ఏటీ అగ్రహారం, చుట్టుగుంట, కేవీపీ కాలనీ, లాలుపురం రోడ్డు, అరండల్ పేట, శంకర్ విలాస్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఆదివారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే నగరంలో పర్యవేక్షణ సౌలభ్యం కోసం శానిటరీ డివిజన్ల పెంపు చేసి, పారిశుద్ధ్య పనులకు అవసరమైన సామగ్రిని అందించామన్నారు. కార్మికులను డివిజన్ల వారీగా రేషనలైజేషన్ చేశామని, అయినప్పటికీ క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య పనుల్లో మెరుగుదల లేక ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయని హెచ్చరించారు. రోడ్డు మార్జిన్లలో గార్బేజ్ నిల్వలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డునకు తరలించాలని కోరారు. అదే విధంగా ప్రజలు రోడ్లపై వ్యర్థాలను వేయకుండా పర్యవేక్షణ చేయాలని, రోడ్లపై వ్యర్థాలు ఎవరు వేస్తున్నది నిఘా పెట్టాలని ప్రజారోగ్యాధికారులను ఆదేశించారు. నగరంలో అనధికార జంతువధ నిషేధమని, ఎవరైనా మాంసం దుకాణం పెట్టాలంటే నగర పాలక సంస్థ నుంచి అవసరమైన అనుమతులు తీసుకోవాలని, అనుమతి లేకుండా దుకాణాలు పెడితే వారి దుకాణాలు సీజ్ చేయాలని ప్రజారోగ్యాధికారులను ఆదేశించారు.

అందరికీ అంబేడ్కర్ స్ఫూర్తిదాయకం



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: భారత సమాజాన్ని నిరంతరం నడిపిస్తున్న మహాశక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని.. ఆయన భావాలకు మరణం లేదని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ గుంటూరు, నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ముందస్తు జయంతి వేడుకలు లాడ్జి సెంటర్ కూడలిలో ఆదివారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ డైరెక్టర్ అంశుమాన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రాధాన్యం, అంబేడ్కర్ ఆశయాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం లాడ్జిసెంటర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు జరిగిన పాదయాత్రకు ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర గుంటూరు జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి, నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రామారావు , డీఈఈ ఎం.రమేష్ బాబు, ఎన్ఎస్ఎస్ డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జీవీ సుధీర్ కుమార్, స్టెప్ మేనేజర్ రాధిక, ఎన్‌సీసీ 10 ఆంధ్ర బాలికల బెటాలియన్ నాయబ్ సుబేదార్ సూర్యకాంతి కోరాదే పాల్గొన్నారు.

కిమ్స్ శిఖర హాస్పిటల్ క్లిష్టమైన బ్రెయిన్ సర్జరీ



డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు

గుంటూరు మెడికల్: బ్రెయిన్‌లో అరుదైన ట్యూమర్స్‌తో బాధపడుతున్న ఓ మహిళకు గుంటూరులోని కిమ్స్ శిఖర హాస్పిటల్ వైద్యులు అత్యంత అరుదైన సర్జరీ చేసి రోగి ప్రాణాలు కాపాడారు. చీఫ్ న్యూరోసర్జన్, హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు చెప్పారు. ఆదివారం ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో సర్జరీ వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. పల్నాడు జిల్లాకు చెందిన 50 ఏళ్ల సీత తరచుగా ఫిట్స్‌తో బాధపడుతున్నట్లు చెప్పారు. పలు ఆస్పత్రుల్లో చికిత్స కోసం వెళ్లినా ఫిట్స్ సమస్య తగ్గకపోవటంతో తమ ఆస్పత్రిలో న్యూరాలజిస్ట్ డాక్టర్ సూర ప్రదీప్‌కుమార్ రెడ్డిని సంప్రదించారని చెప్పారు. రోగి మెనింగియోమాటోసిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు ,బ్రెయిన్‌లో నాలుగు ట్యూమర్స్ ఉన్నట్లు గుర్తించారన్నారు. న్యూరోసర్జరీ వైద్య బృందం పరీక్షలు చేసి బ్రెయిన్‌లో ఉన్న ట్యూమర్స్ క్యాన్సర్ గడ్డలు కాదని నిర్ధారించామన్నారు. నాలుగు రోజుల క్రితం సుమారు ఏడుగంటల సేపు అరుదైన సర్జరీ చేసి బ్రెయిన్‌లో సుమారు 500 గ్రాముల బరువున్న నాలుగు గడ్డలను విజయవంతంగా తొలగించామని చెప్పారు. తమ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పద్ధతులైన న్యూరో నావిగేషన్, 25 టైమ్స్ మల్టిపుల్ చేసే మైక్రోస్కోప్, కూసా న్యూరో డ్రిల్, ఇంట్రా ఆపరేటివ్ మానిటరింగ్ వంటి అధునాతన వైద్య పరికరాలతో ఆపరేషన్ విజయవంతంగా చేసినట్లు వెల్లడించారు. సీత పూర్తిగా కోలుకోవటంతో ఆదివారం ఆస్పత్రి నుండి డిశ్చార్జి చేస్తున్నట్లు తెలిపారు.

ముస్లింలను తప్పదోవ పట్టిస్తున్నారు..

- తూర్పు ఎమ్మెల్యే దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలి
- బీజేపీ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న ఖుద్దూస్, షేక్ రఫీ తదితరులు

గుంటూరు మెడికల్: ప్రధాని నరేంద్రమోదీని కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్ సీపీ నాయకులు తిడుతున్న వేదికపైన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ హాజరు కావడం విడ్డూరంగా ఉందని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖుద్దూస్, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ షేక్ రఫీ అన్నారు. ఆదివారం గుంటూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వం, దేశంలో నరేంద్రమోదీ నాయకత్వంలో పేద, ముస్లీం వర్గాలకు న్యాయం చేయటం కోసమే వక్ఫ్ సవరణ బిల్లు తీసుకురావడం జరిగిందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పులను సరిదిద్దటమే నేడు ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న వక్ఫ్ సవరణ బిల్లు అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి తలవంపులు తెచ్చేలా, ఆ పార్టీకి అపకీర్తిలాగా వ్యవహరించిన నసీర్ అహ్మద్‌ను తక్షణం ఎమ్మెల్యేగా తప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో షేక్ గౌస్ పీరా, షేక్ మౌలాలి, షేక్ ఫరహానా పాల్గొన్నారు.

ఎడారి ఓడ పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న అతిథులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీపద్మావతి కల్యాణ వేదికపై ఆదివారం సహజ సాహితీ వ్యవస్థాపకులు(చీరాల) వడలి రాధాకృష్ణ రచించిన ఎడారి ఓడ(వజ్రోత్సవ జ్ఞాపిక) పుస్తకావిష్కరణ మహోత్సవ సభ నిర్వహించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కవి, రచయిత ఎం.ప్రభాకర్(అమరావతి) ఆవిష్కరించగా, సనాతన సారథి సంస్థ అధ్యక్షుడు సనాతన బాలరాజు(మహబూబ్‌నగర్) తొలి ప్రతి స్వీకరించారు. సామాజిక కార్యకర్త పలకలూరి శివరావు, సంఘ సేవకులు బత్తుల మురళీ, రచయిత గొర్రెపాటి శ్రీను, డాక్టర్ పెరుగుపల్లి బలరాం, ఎస్.సన్యాసిరావు, తెలుగు భాష వికాస సమితి నుంచి డాక్టర్ డీఆర్‌బీ ప్రసాద్, అమ్మవడి అధ్యక్షులు ఎ.శ్రీనివాసరావు, విశాల సాహితీ సమితి అధ్యక్షులు డాక్టర్ జెల్డి విద్యాధరరావు(హైదరాబాద్) పాల్గొన్నారు. అనంతరం అతిథులను సత్కరించారు.

50 ఏళ్లకు అపూర్వ కలయిక



గుంటూరు ఎడ్యుకేషన్: ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల 1975-76 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం బ్రాడీపేటలోని ఓ హోటల్లో అర్ధ శతాబ్దపు అపూర్వ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకనాడు విద్యార్థులుగా కలిసిమెలసి చదువుకున్న సహచర మిత్రులను కలుసుకున్న ఆనందంలో పూర్వ విద్యార్థులు మునిగితేలారు. ఆప్యాయంగా పలకరించుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. విశ్రాంత అధ్యాపకుడు కె.వేణుగోపాల్, వివిధ రంగాల్లో పని చేసే ఉద్యోగ విరమణ పొందిన చంద్రశేఖర్, సిహెచ్.రామారావు, కృష్ణ మోహన్, ఎస్ఎం సుభాని, రామనాథం, జయప్రద, విశ్వనాథ రెడ్డి శేష సాయి, పి.వి.శర్మ పాల్గొన్నారు.

నేత్ర సమస్యలపై శ్రద్ధ అవసరం



లక్ష్మీపురం: నేత్రాల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని నేత్ర వైద్యనిపుణులు శ్రావణి లక్ష్మి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేత్రలపై నిర్లక్ష్యంతో చూపు కోల్పోయిన లేదా మందగించినా మనం మన రోజువారి కార్యకలాపాల కొరకు కూడా ఇతరులపై ఆధారపడాల్సి వస్తుందని హెచ్చరించారు. పెద్ద వయసు వారిలో ముఖ్యంగా రెండు సమస్యలు చూస్తుంటాయని అందులో ఒకటి శుక్లా ఈ సమస్య వయసు మీద పడిన వారికి సహజంగా వస్తుందన్నారు. శస్త్ర చికిత్స ద్వారా కంటిలో అద్దాలను అమర్చి కంటి చూపు మంచిగా ఉండేలా అధునాతనమైన వైద్య విధానాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయన్నారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా వాణిజ్యవేత్త బాదం బసవ గుప్త, విశ్రాంత అధికారి వి.సత్యనారాయణ సభలో ప్రసంగించారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



నెహ్రూనగర్: నగరంలో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈస్టర్‌ను పురస్కరించుకుని ఆయన అనుభవించిన శ్రమదినాలకు గుర్తుగా 40 రోజులపాటు క్రైస్తవులంతా ఉపవాసంలోను, దానధర్మంలోను పాల్గొన్నారు. ఏసుక్రీస్తు జెరూసలెంలోకి ప్రవేశించిన రోజున మట్టలను అలంకరించి ఆయనకు స్వాగతం పలుకుతారు. ఈ నేపథ్యంలో మట్టల ఆదివారం నిర్వహించారు. స్థానిక నెహ్రూనగర్ చివర ఉన్న వెంకటాద్రిపేటలోని చిన్నారులు ఈతమట్టలు చేతపట్టి హోసన్న గీతం పాడుతూ నెహ్రూనగర్‌లో ఊరేగింపు నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉపవాసదీక్షలు ఆఖరి వారానికి చేరుకోవడంతో ఈ వారం రోజులపాటు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

అలరించిన సంగీత విభావరి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆదివారం సాయంత్రం మహతీ స్వరసుధ రజతోత్సవ వేడుకలు నిర్వహించారు. పామిడి ఘంటం వెంకట సుబ్బారావు, వెంకటసత్యనారాయణ, వాసుదేవరావు, ధర్మజ్యోతి, పాలకమండలి అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. గాయని గాయకులు పత్రినిర్మల, సుధా, రాజ్యలక్ష్మీ, జరీనా, ప్రద్యుమ్న, హరికృష్ణ, కమల్ కిషోర్, బి.వీరయ్య తదితరులు తమ గాత్రంతో భక్తి, సినీ గీతాలను ఆలపించారు. కీబోర్డ్‌పై కె.రవిబాబు, తబలాపై ఎస్.వెంకట్, పాడ్స్‌పై టి.ఈశ్వర్ వాయిద్యాన్ని అందించారు. అనంతరం కళాకారులను సత్కరించారు.